# గది

ఆ పెద్ద ఇంట్లో ఉండటం ఈ మధ్య మరీ ఆనందంగా ఉంది-శాంతమ్మకి. పూలచెట్లు, జామచెట్లు, మల్లెపందిరి ఎంతో ముచ్చటగా పెరిగాయి. తెల్లారేసరికి జామచెట్టు మీద కనిపించే చిలుకల్ని చూడటం ఎంతో హాయిగా ఉంటుంది శాంతమ్మకి. శాంతమ్మ భర్త రామారావుకీ ఆ చెట్లూ, మల్లెతీగ మనసుకి ఆనందాన్నిస్తాయి. కానీ చిత్రమేమిటంటే ఆ ఇంట్లో ఉండే పిల్లలిద్దరికీ ఆ ఇల్లంటే చిరాకు.

"అబ్బ, ఈ గింజలన్నీ కింద ఎలాపడ్డాయో, ఛీ," - విసుక్కుంటుంది సునీత - చెట్టుపై నుంచి జామపండు తిని గింజలు కింద విసిరేసే చిలకను చూస్తూ. "ఏమిటి డాడీ, ఈ ఇల్లు అమ్మి పారేసి, ఫ్లాట్ కొనుక్కుందామంటే వినరూ" - నసుగుతాడు కొడుకు సురేష్.

తల్లీతండ్రీ పిల్లలకి ఏ సమాధానం చెప్పరని చాలాసార్లు వాళ్లపై కోపం కూడా వస్తుంది పిల్లలకి. మెడిసిన్ చదువుతున్న సురేష్, ఇంజనీరింగ్ చదువుతున్న సునీత కలిసి తండ్రి గదిలో కొచ్చారు ఆ సాయంత్రం.

"మీరేం చెప్తారో నాకు తెలుసు, కానీ నేను ఉండగా ఇది జరగదు" అన్నాడు రామారావు పేపర్ తిరగేస్తూ

"అది కాదు డాడీ!" ఏదో చెప్పబోయింది అమ్మాయి. అంతలో గుక్కపట్టి ఏడుస్తున్న పసిపిల్లాడి గొంతు విని ఉలిక్కిపడ్డాడు సురేష్. కుర్చీలోంచి లేచి వెళ్ళి గబుక్కున ఎత్తుకున్నాడు- ఆర్నెల్ల పసివాణ్ణి రామారావు.

"ఛీ"-విసుగ్గా వెళ్ళి కారు స్టార్ట్ చేశాడు సురేష్.

"వీడి సంగతి చూడు, తరవాత ఊడుద్దువుగాని అన్నాడు ఆ పసివాణ్ణి ఎత్తుకుని, సందులోకొచ్చిన రామారావు.

"వస్తున్నానయ్యా" చీపురు పక్కన పడేసి చేతులు చీర కొంగుతో తుడుచుకుంటూ గబగబా పిల్లాణ్ణి ఎత్తుకెళ్ళింది సిద్దమ్మ. వెనక వరండాలో నేలమీద పరిచిన పాతచీర మీద పిల్లాడిని పడుకోబెట్టి పాలిచ్చింది సిద్దమ్మ.

"ఆ పనిమనిషికి చెప్పు మమ్మీ! ఆ పిల్లాడిని ఇంట్లో ఉంచి పనికి రమ్మని... ఇక్కడే వాడికి పాలివ్వటం, ఇక్కడే వాడి..థూ" సునీత డైనింగ్ టేబుల్ దగ్గర కాఫీ తాగుతోంది.

"ఆ పసివాడికి పాలు తాగించి పడుకోబెట్టి పనిచేసుంటుంది... ఇంట్లో వదిలి ఎలా వస్తుందీ" అంటూనే శాంతమ్మ రెండు చపాతీలు సిద్దమ్మకి పెట్టి-

"కాస్త తిని పనిచేయి, పిల్లాడి గురించీ చూసుకోవాలిగా" అంది. సునీత అంతా గమనిస్తూనే ఉంది. ఆ సిద్దమ్మకి ఒక పదేళ్ళ ఆడపిల్ల. దాని తరవాత ఇద్దరు పుట్టిపోయాక, ఈ పిల్లాడు మళ్ళీ, దాని కష్టాలు చెప్పుకుంటుంటే శాంతమ్మ వింటుండటం గమనిస్తూనే ఉంది సునీత ఎప్పటినుంచో.

"ఈ పనిమనిషి మానేస్తే ఇంకోర్తి రాదా" అంది కోపంగా సునీత ఓ రోజు.

"ఇంకోర్తి ఎందుకే.. పాపం, ఇది మంచిది. అయినా నీకు దాంతో పేచీ ఏమిటీ–" అంది తల్లి. కోపంతో బుగ్గలు ఎర్రబడ్డాయి సునీతకి.

"నాకు పేచీయే.. ఇప్పుడిది వెళ్తుంది ఇంక అది వస్తుంది. వచ్చింది పని చేసుకుపోదుగా... నా గదిలో కొచ్చి నేను పెట్టుకొనే స్టిక్కర్ బొట్టు కావాలట. నేను వేసుకునే గోళ్ళరంగు కావాలట. అంతేకాదు, అక్కా, అక్కా అంటూ,"– సునీత అంటుంటే ఫక్కున నవ్వింది తల్లి.

"ఏదో చిన్నది.. నేను కొనిస్తాలే దానికి స్టిక్కర్లు, గోళ్ళరంగు... ఇంకేమి కావాలందీ" తల్లి మల్లెపూలు మాలకడుతూ అంది. సునీత కోపంగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

సిద్దమ్మ వెళ్ళిన పది నిమిషాలకి దాని పిల్ల 'పోచి' వచ్చేసింది. రావడం రావడమే డాబా మీదకెళ్ళి పిందెలు, కాయలు, పళ్ళు తేడా లేకుండా జామకాయలు కోసేస్తుంది. అలా కొయ్యవద్దని ఎన్నిసార్లు చెప్పినా వినదు. 'గబగబా పనిచేసేసి వెళ్ళిపోవే ఇంటికి'– అంటే వెళ్ళదు. అవసరం ఉన్నవీ లేనివీ ఏదో కల్పించుకు చేస్తూ ఆ ఇంట్లోనే చాలాసేపు గడిపేస్తుంది.

కూరలకెళ్ళాలన్నా, సినిమాకెళ్ళాలన్నా, ఎవరింటికైనా పేరంటానికెళ్ళాలన్నా పోచీని వెంటబెట్టుకెళ్ళడం బాగా అలవాటయింది శాంతమ్మకి.

సాయంత్రం ఆరయింది. పోచి మల్లెపూలు కడుతోంది. రామారావు, శాంతమ్మ ముందు గదిలో కబుర్లు చెప్పుకుంటున్నారు.

"రేపు అదీ, మొగుడూ యాదగిరి గుట్ట వెడతారట. దీన్ని ఇక్కడే ఉండనిమ్మంది" అంది శాంతమ్మ.

"దీన్నీ వాళ్ళతో తీసికెళ్ళచ్చుగా" అన్నాడు రామారావు. "అటునించి దాని పుట్టింటికి కూడా ఇద్దరూ వెళ్తారట– అందుకే, ఇంత ఇంట్లో ఆ పిల్ల ఉంటే మనకేం యిబ్బందీ" అంది శాంతమ్మ .

ఇబ్బందేముందీ, ఇల్లు సగం రాసిచ్చేయచ్చు" – నవ్వుతూ అంది సునీత

తల్లీతండ్రీ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. "కాదమ్మా! అది అదే పిల్ల ఎప్పుడూ ఇక్కడే ఎందుకుంటుదీ, ఆ విషయం కనుక్కోండి ముందు అంతేకానీ"– సునీత విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

రామారావు పడక్కుర్చీలో ఆలోచిస్తూ పడుకున్నాడు. శాంతమ్మ ముఖం చిరాగ్గా పెట్టుకుని కారు శుభ్రంగా తుడుస్తున్న పోచివంక చూసింది. "పోచీ, మీ అయ్య ఇంట్లో లేడా" అంది శాంతమ్మ. "రిక్షా తొక్కి పన్నెండింటికొస్తాడమ్మా.."

"వచ్చాక" పోచి కారు తుడుస్తూ ఊరుకుంది. అంతలో గుమ్మంలోకి కూరలొచ్చాయి. శాంతమ్మ కూరలు కొంటోంది.

ఆ రోజు విషయం గుర్తొచ్చింది పోచీకి... తను పని పూర్తిచేసుకుని అన్నం గిన్నె పట్టుకుని గబగబా ఆ ఇంటికెళ్ళింది. -చిన్న గది అందులోనే ఓ మూల స్టౌవ్ మీద వేణ్ణీళ్లు కాగుతున్నాయి. అడ్డంగా ఓ తడిక... ఆ తడిక వెనక ఓ కుక్కి మంచం, ముందు చిన్న అరుగు, అదే తన ఇల్లు. పోచి ఆ తడిక తోసుకు లోపలకొచ్చేసరికి, ఛీ-అమ్మ గబుక్కున లేచి బయటకొచ్చింది!!

"నాలుగింటివరకూ రావద్దని చెపక్పలే. ఎందుకొచ్చావ్? "పోచి వీపు మీద గుద్దింది.

కింద చాపమీద పడుకున్న పిల్లాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. పోచి ఏడ్చి ఏడ్చి గబగబా ఇంటి బయటికొచ్చి నిలబడింది. - ఆ తరువాత దాని అయ్య చొక్కా వేసుకు బయటకొచ్చి రిక్షా బయటకు తీసి -"నువ్వు అమ్మింట్లో సాయంత్రం దాకా ఉండాలి. తెలిసిందా?" అన్నాడు. ఎర్రటి కళ్ళు చూస్తే భయమేసింది పోచికి.

పరిగెత్తి వచ్చేసింది శాంతమ్మ ఇంటికి - అప్పుడే అనిపించింది పోచికి - ఇంత పెద్ద ఇల్లుంది కదా, రెండు గదులు మాకివ్వకూడదూ. ఆ తడికిల గది గుర్తుకొచ్చి, గట్టిగా కళ్ళు మూసుకుంది పోచి భయంగా.

"ఏమే పరిగెత్తుకుంటూ అప్పుడే వచ్చేశావే?" ఇక్కడేం పనుందీ?" -టీవీ చూస్తున్న పోచి మీద అరిచింది సునీత. మా ఇంట్లో అమ్మ లేదు. అందుకని" నసిగింది పోచి. పోచి తండ్రి రిక్షా తొక్కి ఇంటికొచ్చాక, తల్లి ఇంట్లోనే ఉంటుంది. వాడు పనికెళ్ళాక, సిద్ధమ్మ పనికొస్తుంది. అంతసేపూ ఏదో వంకతో ఈ పోచి, శాంతమ్మ ఇంట్లోనే ఉంటుంది.

సునీత, సురేష్ డాబా మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడు ఐదవుతోంది. పోచి ఇంటి గేటును ఆనుకుని నిలబడింది.

"ఈ పిల్ల ఎందుకు ఇంటికి పోదురా?" అంది సునీత.

"నాకూ అదే అర్థం కాదు" అన్నాడు సురేష్ పోచివంక చూస్తూ. ఎర్రటి పూసల రబ్బరు బాండ్ పోచి జడపైన పెట్టుకుంది. దొడ్లో పూసిన మల్లెపూలు దండ కట్టుకుని పెట్టుకుంది. నల్లగా కళకళలాడుతూ ఉంటే పోచి చక్కగా ఉంటుంది. చూడ్డానికి. సురేష్ కాసేపు దానికేసి అలాగే చూశాడు.

"పాపం దీన్ని స్కూల్లో వేస్తే చదువుకుంటుందిగా" అన్నాడు.

"వాళ్ళమ్మ ఒప్పుకోదు. ఇప్పుడే ఇది సంపాదించేస్తోందిగా" అంది సునీత. అలా ఇద్దరూ మాట్లాడుకుంటుంటేనే సిద్ధమ్మ రావటం, పోచి దాంతో కలిసి ఇంటికెళ్ళిపోవటం జరిగింది.

ఇద్దరి మనసుల్లోనూ ఒకటే ఆలోచన ఈ పిల్ల ఇంటికెందుకుపోదూ!! అని. "ఒక్క గదిలో ఉండటం ఇబ్బంది. అందుకే ఇక్కడ హాయిగా ఉంటోంది" అంది సునీత. "ఒక్క గది కాకపోతే భవనముంటుందా" అన్నాడు సురేష్?

వారం రోజులయింది. సిద్ధమ్మ తలనిండా పూలు పెట్టుకుని గుమ్మంలో శాంతమ్మతో ఏదో చెప్తోంది సునీత గబగబా వచ్చింది.

"ఏమే సిద్దీ - ఆ పిల్లని రోజంతా ఇక్కడే ఉంచుతాంవేంటీ" అంది.

సిద్ధమ్మ మాట్లాడలేదు.

"నిన్నే ..పొద్దున్నించీ సాయంత్రందాకా ఇక్కడ దానికి పని ఉందనుకుంటున్నావా" అంది మళ్ళీ.

సిద్ధమ్మ మాట్లాడలేదు. "ఏమిటో చెప్పు" సునీత నిలదీసింది.

సిద్ధమ్మ నెమ్మదిగా తలదించుకుని నవ్వింది.

"అంటే"

"అదేనమ్మాయిగారూ.. ఓ రెండు గంటలు రిక్షా పనిచూసుకుని ఆడు ఇంట్లోనే ఉంటాడూ" అంది మెల్లగా.

"వుంటే" అంది సునీత మళ్ళీ.

"ఏంటమ్మాయిగారూ... మీరు సదువుకున్నోళ్ళు, నేనేం చెప్తా? ఆ ఒక్కగదిలో-" సిద్ధమ్మ మాట్లాడకుండా లోపలకెళ్ళి గదులు ఊడ్చటం మొదలుపెట్టింది.

సునీత అప్రయత్నంగా నోటికి చెయ్యి అడ్డంపెట్టుకుని నవ్వుకుంది.

గబగబా పైకెళ్ళింది సునీత. భోజనాలు చేస్తున్నారంతా. పోచి గుమ్మంలో కూచుంది.

ఇరవైఏళ్ళనాడు తను కాపురానికొచ్చినప్పుడు!! పెళ్ళీడుకొచ్చిన పద్దెనిమిదేళ్ళ ఆడబిడ్డ, చదువుకొనే మరుదులు అత్తగారు, అత్తగారి తల్లి, ఆ మూడు గదుల ఇంటికి - శాంతమ్మకి ఒక్కసారి కళ్ళముందు కనిపించింది. భర్త పదినిమిషాలు ఒంటరిగా కలిసి కబుర్లు చెప్పుకోవడానికి వీలుకాక పడ్డ ఇబ్బందులు ఎన్నెన్నో గుర్తొచ్చి నవ్వొచ్చింది శాంతమ్మకి.

"ఎందుకో ఆ నవ్వు" అన్నాడు రామారావు.

"ఇరవైయ్యేళ్లు వెనక్కి వెళ్ళండి- మీకూ నవ్వొస్తుంది" అంది శాంతమ్మ. కూతురు, కొడుకు ఒకరి మొహాలు ఒకరు చూసి నవ్వుకున్నారు రహస్యంగా.

ఆర్నెల్లు గడిచాయి- ఆ పెద్దింటి పెరటివైపు ఓ చిన్న ఇల్లు లేచింది... ఓ పడగ్గది, చిన్న వంటగది. చాలు, చాలమ్మా అంది సిద్ధమ్మ. ఆ సిద్ధమ్మ ముఖంలో వెలుగు చూస్తుంటే సునీతకి ఆనందమేసింది.

"పోన్లే, అయినా ఈ ఇల్లు అమ్మది, అమ్మిష్టం" అని మనసులో అనుకుంటూ గుమ్మంలో ముగ్గుపెడుతున్న పోచివంక చూసింది.

"పున్నమెళ్ళాక దీని పెళ్ళి" అంది సిద్ధమ్మ.

"ఏమిటీ, పోనీలే మంచిపనే" అంది శాంతమ్మ.

"నీకు బుద్ధిలేదా, దానికి పెళ్ళేమిటిప్పుడూ" అరిచింది సునీత.

"నీకెందుకే" అంది శాంతమ్మ సునీతని చూస్తూ.

నిజమే, తనకెందుకూ, ఈ పోచికి పెళ్ళిచేసి దానికీ ఓ గది కట్టించి ఇస్తుంది మా అమ్మా, దాని పిల్లల్ని ఎత్తుకు మురిసిపోతుంది ఇంక అంతే'- సునీత మనసులో చాలా చిరాగ్గా అనుకుంటూ కారు స్టార్ట్ చేసి బయటకెళ్ళిపోయింది.

– 'ఈనాడు' ఆదివారం 28 జనవరి 2001